www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 12 మార్చి 2024
5
వైఎస్ఆర్



లా సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి -కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ న్యాయ కళాశాల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలు సోమవారం వైవియులో ప్రారంభమయ్యాయి. మూడేళ్ల లా కోర్సు ఐదవ సెమిస్టర్ పరీక్షకు 242మంది హాజరుకాగా, 23 మంది గైర్హాజరయ్యారు. ఐదేళ్ల లా 9 సెమిస్టర్ పరీక్షకు 209 మంది హాజరుకాగా 17మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెమిస్టర్ పరీక్షకు 99 మంది హాజరు కాగా 17మంది పరీక్షకు హాజరు కాలేదు. పరీక్షల సూపరింటెండెంట్ ఆచార్య పి.ఎస్ షావల్లి ఖాన్ పర్యవేక్షణలో పరీక్షలు కొనసాగుతూ ఉన్నాయి. పరీక్షల తనిఖీలో భాగంగా విసి వెంట రిజిస్ట్రార్ వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథ్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎస్. ఈశ్వర్ రెడ్డి ఉన్నారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా వైద్యులు, వైద్య విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో సిఎం జగన్

అభివృద్ధికి నిదర్శనం.. పులివెందుల



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిఎం జగన్

రూ.861.84 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం
అందుబాటులోకి రూ.500 కోట్ల ప్రభుత్వ వైద్య కళాశాల
పులివెందులలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బిజీబిజీ

ప్రజాశక్తి-పులివెందుల టౌన్/రూరల్/వేంపల్లె/కడప

పులివెందుల అభివృద్ధి రాష్ట్రానికే ఆదర్శనీయమని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన ఒక్కరోజు జిల్లా పర్యటనలో భాగంగా పులివెందులలో రూ.861.84 కోట్లతో నిర్మించిన పది రకాల అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి జిల్లా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు తన సొంత గడ్డపై ముఖ్యమంత్రిగా మీ అందరి ముందు నిలుచున్నానంటే మీ అందరి అభిమానం, ఆశీస్సులు, దేవెనెలేనన్నారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పులివెందులలో ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరుగుతోందన్నారు. పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి అనేది అనంతం అని, కాలానుగుణంగా అభివృద్ధి కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు. సొంత గడ్డపై మమకారం ఎప్పటికీ తీసిపోయేది కాదన్నారు. పులివెందుల అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరడంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఐదు సంవత్సరాల నుంచి చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్క అధికారి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక పర్యవేక్షణ పెట్టి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన ప్రణాళికలు, అధికారులతో పర్యవేక్షణ ఉండాలన్నారు.

రూ.861.84 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



మినీ సెక్రటేరియట్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి

పులివెందులలో రూ.861.84 కోట్లతో నిర్మించిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. మొదటగా కడప రోడ్డులో నాబార్డు, ఆర్ఐడిఎఫ్ సంయుక్తంగా రూ.500 కోట్లతో 50 ఎకరాల్లో నిర్మించిన 627 పడకలు కలిగిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వైఎస్ఆర్ ప్రభుత్వ వైద్యకళాశాల, నర్సింగ్ కళాశాలలు, రూ.70 లక్షలతో వైఎస్ఆర్ జంక్షన్‌లను ప్రారంభించారు. నల్లపురెడ్డిపల్లిలో ప్రభుత్వ, పాడా సంయుక్తంగా ఇదెకరాల్లో రూ.20 కోట్లతో నిర్మించిన ఇంటెగ్రేటెడ్ అరటి ప్యాక్‌హౌస్, రూ.38.15 లక్షలతో కూడిన వైఎస్ఆర్ మినీసెక్రటేరియట్ భవనాలను, మోడల్ టౌన్ ప్రాజెక్టులో భాగంగా పులివెందుల మెయిన్‌రోడ్డులో రూ.11.4 కోట్లతో నిర్మించిన సెంట్రల్‌బోలే వార్డును ప్రారంభించారు. బైపాస్ రోడ్డులో రూ.20.69 కోట్లతో నిర్మించిన వైఎస్.జయమ్మ, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను, రూ.80 లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మించిన గాంధీ జంక్షన్, పులివెందుల పట్టణ సమీపంలో 100 ఎకరాల్లో రూ.65.99 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్‌ను ప్రజలకు చేరువ చేశారు. అనంతరం ఇండస్ట్రియల్ పార్క్‌లో రూ.175 కోట్లతో నిర్మించిన ఆధిత్యబిర్లా అనే ప్రయివేటు సంస్థ నిర్మించిన పేస్-1 యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం ఇడుపులపాయకు చేరుకుని రూ.39.13 కోట్ల ప్రభుత్వ, పాడా నిధులతో నిర్మించిన వైఎస్ఆర్ మెమోరియల్ పార్కును ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలం సురేష్, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఎం.టి.కృష్ణబాబు, కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జెసి గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ వెంకటేష్, శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ ఎస్ .సతీష్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్.మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యాడ్ ఛైర్మన్ చిన్నప్ప, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు. సిఎం పర్యటన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. అనంతరం కడప ఎయిర్‌పోర్టు నుంచి తాడేపల్లికి బయల్దేరివెళ్లారు.



బనాన ప్యాక్ హౌస్‌ను పరిశీలిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి



ప్రభుత్వాస్పత్రిలోని స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సిఎం



నర్సింగ్ కళాశాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి జగన్

ఎన్నికల ముందే 'సుప్రీం' ఆదేశాలు అమలు చేయాలి

ఎస్‌బిఐ కుంటి సాకుల వెనక బిజెపి ఒత్తిడి
సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎన్నికల బాండ్లపై సుప్రీం కోర్టు ఆదేశాలను ఎన్నికల ముందే ఎస్‌బిఐ అమలు చేయాలని, కుంటి సాకుల వెనుక బిజెపి ఒత్తిడి ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక ఏడు రోడ్ల కూడలిలోని ఎస్‌బిఐ బ్రాంచ్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఎన్నికల బాండ్ల లావాదేవీలపై ఈనెల13 లోపు సుప్రీం కోర్టుకు ఎస్‌బిఐ అన్ని బ్రాంచ్‌లు తెలియజేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ఒత్తిడితో లోక్ సభ ఎన్నికల తర్వాత ఎస్‌బిఐ. ఎన్నికల బాండ్ల వివరాలు, లావాదేవీలు, పేర్లు, ఇస్తామనడం అహేతుకమైన విషయమని చెప్పారు. సుప్రీం కోర్టు ఎన్నికల ఎలక్ట్రోరల్ బాండ్స్ చట్టాన్ని కొట్టివేస్తూ, 21 రోజు లోపల 2019 నుంచి 2024 వరకు ఎన్నికల బాండ్ల వివరాలు, లావాదేవీలు, ఇచ్చిన వారు, పుచ్చుకున్న వారి వివరాలు, సుప్రీం కోర్టుకు ఈనెల 13 లోపు తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, బిజెపి ఒత్తిడితో ఎస్‌బిఐ నేటి నుంచి మళ్లీ 116 రోజులు గడువు కావాలని సుప్రీం కోర్టులో అఫిడవిట్ వేయటం చూస్తుంటే దారుణమన్నారు. దీని బట్టి చూస్తే 2024 ఏప్రిల్ ఎన్నికలు ముందు వివరాలు ఇవ్వడానికి సిద్ధంగా లేనట్లు తెలుస్తుందన్నారు. ఎన్నికల బాండ్ల వాస్తవాలు, నిజాలు దేశ ప్రజలకు తెలియజేయకుండా ఆపటానికి బిజెపి కేంద్ర ప్రభుత్వం లోని ఎస్‌బిఐ రాజ్యాంగ సంస్థను ప్రభావితం చేస్తున్నట్లుగానూ తేటతెల్లమవుతోందని ఆరోపించారు. ఎస్‌బిఐ సుప్రీంకోర్టు ఇచ్చిన ప్రాథమిక సమాచారంలో రూ. 6 వేల 565 కోట్ల విలువచేసే వాళ్లు బిజెపి ఎన్నికల విరాళాలు బాండ్లు ఇచ్చారని చెప్పారు.22 వేల 217 బాండ్లు అన్ని రాజకీయ పార్టీలకు వచ్చినట్లుగా చెప్పారని దీని వివరాలు చెప్పటానికి నాలుగు నెలల కాలం అవసరం లేదని ఎవరికైనా అర్థమవుతుందన్నారు. నాలుగు నెలల కిందట బిజెపికి ఎప్పుడు ఎన్నికల విరాళాలు ఇవ్వని 23 కార్పొరేట్ సంస్థలు రూ.9.05 కోట్లు విరాళాలు ఇచ్చాయని చెప్పారని, వారి పేర్లు వెల్లడించడానికి సమయం కోరడం హాస్యాస్పందంగా ఉందన్నారు. దేశ ఎన్నికల్లో అత్యంత అవినీతి కరమైన బిజెపి ప్రభుత్వం అని ప్రజల ముందు నిరూపణ అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు ఎస్.రాజేంద్ర పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** ఎన్నికల బాండ్ల వివరాలు బయటపెట్టే వరకు 2024 సార్వత్రిక ఎన్నికలు జరపవద్దని సిపియం కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు సిపిఎం సోమవారం స్థానిక స్టేట్‌బ్యాంక్ (కోర్టుబ్రాంచ్) ఎదుట ధర్నా నిర్వహించింది. కార్యక్రమంలో కిరణ్, బాల సుబయ్య, మహిళాసంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్, రాములమ్మ, లక్ష్మిదేవి, మల్లికాబాను పాల్గొన్నారు. **బద్వేలు :** పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ఉన్న ఎస్‌బిఐ బ్రాంచ్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు బిజెపి ఒత్తిడితో లోక్ సభ ఎన్నికల తర్వాత ఎస్‌బిఐ.ఎన్నికల బాండ్ల వివరాలు, లావాదేవీలు, పేర్లు, ఇస్తామనడం అహేతుకమైన విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం బద్వేల్ పట్టణ కార్యదర్శి కె. శీను, పట్టణ నాయకులు ముడియం చిన్ని, ఎస్.కె. మస్తాన్, షరీఫ్, గంగనపల్లి నాగార్జున, ఆంజనేయులు, బాల గురయ్య, ఇమ్మానేలు, సురేంద్ర, నరసింహ, యువరాజ్, మోక్షమ్మ, మస్తాన్, బాలమ్మ, సుబ్బలక్ష్మి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



కడప ఎస్‌బిఐ ఎదుట ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు



బద్వేల్, ప్రొద్దుటూరులలో ఎస్‌బిఐ ఎదుట నిరసన చేస్తున్న సిపిఎం నాయకులు

14న నిరసనలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, కార్మికులు, కర్షకుల హక్కులను కాలరాస్తున్న, కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపాలని ఈనెల 14న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కడప జిల్లా వ్యాప్తంగా జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, కామనురు శ్రీనివాసులు రెడ్డి, దస్తగిరి రెడ్డి, సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని చిలకల బావి దగ్గర ఉన్న ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు కల్పించిన నరేంద్ర మోడీ రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికుల హక్కులను కాల రాశారని మండిపడ్డారు. అదాని, అంబానిని కుబేరులను చేసి, రైతులను, వ్యవసాయ కార్మికులను అప్పులు పాలు చేశారని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకే మూడు నల్ల చట్టాలు తీసుకువచ్చారని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లు గా మార్చారన్నారు. భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని చెప్పారు. నిరంకుశ పరిపాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. బిజెపి ప్రభుత్వాన్ని గద్దించేందుకు అన్ని వర్గాల ప్రజలు ఏకం అవ్వాలన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు 50 శాతం ప్రకారం మద్దతు ధరల చట్టంచేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. ఉపాధి కూలీలకు 200 పని దినాలు పెంచి, వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని రద్దు చేయాలని పేర్కొనాక్నరు. కరువు, తుఫాన్ నష్టపరిహారా లను, ఇన్పుట్ సబ్సిడీలను రైతులకు వెంటనే ఇవ్వాలని, రైతులందరికీ పం టల బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న కౌలు రైతులకే, నష్టపరిహారాలు, బీమా సౌకర్యం ఇవ్వాలన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించి, స్మార్ట్ మీటర్ల బిగించే విధానాన్ని నిలుపుదల చేయాలన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

సిఎం జగన్ ఆత్మావలోకనం చేసుకోవాలి : సిఆర్‌సి

ప్రజాశక్తి కడప అర్బన్

సిఎం జగన్మోహన్ రెడ్డి వైసిపి పాలనపై ఆత్మావలోకనం చేసుకోవాలని ఎమ్మెల్సీ రామచంద్రయ్య అన్నారు. సోమవారం ఎన్‌జిఒ కాలనీలోని తన స్వగృహంలోవిలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఇంటికి వెళ్లడానికి సిద్ధమనే స్పష్టత ప్రజల్లో ఉందన్నారు. టిడిపికి రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలే ముఖ్యని, అందుకే కేంద్రంలోని బిజెపితో పొత్తు కుదుర్చుకుంటుందని స్పష్టం చేశారు. వైసిపి సామాన్యుల జీవితాలను దుర్భరం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని వైఫల్యాలున్న జగన్ ప్రజల్లోకి రావడం హ్యాట్సాఫ్ అని ఎద్దేవ చేశారు. జగన్‌తో పొత్తు పెట్టుకోవడానికి ఎవరూ సిద్ధంగా లేరని చెప్పారు. మీడియాపై దాడులకు దిగుతున్నారని విమర్శించారు. ఇబ్బంది పడ్డ వారిపైనే కేసులు నమోదు చేసే పరిస్థితి రాష్ట్రంలో నెలకుని ఉందని పేర్కొన్నారు. అవినీతిలో పుట్టిన పార్టీ వైసిపి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్నో సాధించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అందుకోసమే పొత్తులు అన్నారు. సింహం ఎవరికి మీ చెల్లెలికా అని సింహాలు అడవుల్లో ఉండాలి ప్రజల్లో కాదని ఎద్దేవ చేశారు. తప్పు ఎత్తి చూపించే వారిని పక్కన పెట్టి భజనపరులను దగ్గర పెట్టుకోడం కాదన్నారు. అగ్రకులాలను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. ఎస్‌సిల బలహీనతలను స్వప్రయోజనాలకు వాడుకొంటున్నారని పేర్కొన్నారు. దేశం అగ్రగామిగా వెళుతున్న తరుణంలో ప్రోత్సహం అందించాలని చెప్పారు. అవినీతి పాలనను సహించే పరిస్థితిలో జగన్ కుటుంబసభ్యులు లేరనన్నారు. కమలా పురంలో పుత్తా నరసిహారెడ్డి కుమారులపై కేసు పెట్టడం సరికా దన్నారు. పోలీసులు నిజానిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

చెన్నూరు : ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణలో భాగంగా మొదటి రోజు సోమవారం మండలంలోని చెన్నూరు రైతు భరోసా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పంట దిగుబడి, ఆరోగ్య విషయాల దృష్ట్యా రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపితే అధిక దిగుబడి తోపాటు లాభాలు సాధించవచ్చని చెప్పారు. రైతుల ఒదరూ తాము ఇచ్చే శిక్షణలో పాల్గొని మెలకువలు, సూచనలు, సలహాలను సద్వినియోగం చేసుకో వాలన్నారు. సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ సాయి మహేశ్వరి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పాటిం చాల్సిన సూత్రాలు. పోషక యాజమాన్యంలో పచ్చి రొట్టె, పైర్లు మల్చింగ్, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, ద్రవ సేంద్రియ ఎరువులపై అవగాహన, కలుపు యాజ మాన్య పద్ధతుల గురించి వివరించారు. అనంతరం ఎఒ శ్రీదేవి మాట్లాడుతూ గత జనవరి, ఫిబ్రవరిలలో వరి పంటలో రైతులు పురుగు తెగుల యాజమాన్యంలో రసాయనాలు విరివిగా వాడడం వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడిందని చెప్పారు. రైతులు చిన్నపాటి మెలుకువలు పాటిస్తే పురుగు, తెగుళ్ల బారి నుండి పంటను సంరక్షించుకుని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం వసంత కుమారి, వెలుగు ఎపిఎం గంగాధర్, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వై. మోహన్ రెడ్డి, ఎంపిపి సురేష్ యాదవ్, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఎన్. భాస్క ర్‌రెడ్డి, ఆర్‌బికె సిబ్బంది, 40 మందికిపైగా రైతులు పాల్గొన్నారు.

అనాథలకు అండగా నిలవడం అభినందనీయం

ప్రజాశక్తి-కాశినాయన

సమాజంలో అనాథలకు, పేదలకు అండగా నిలిచి సేవ చేయడం చాలా గొప్ప విషయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.డి. విజయ జ్యోతి పేర్కొన్నారు. సోమవారం మండ లంలోని ఓబులాపురం సమీపంలో ఉన్న వివేకానంద ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమా జంలో ఎంతోమంది వృద్ధ తల్లిదండ్రులను పోషించకుండా వదిలేస్తున్నారని, అలాంటి వారిని చేరదీసి వారికి నీడతోపాటు అన్నం పెడుతున్న ఆశ్రమ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి అభినందనీయుడని పేర్కొన్నారు. ఆయన సతీమణి రామ తులసమ్మ అక్కడే ఉంటూ వారికి సేవలు చేయడం గొప్ప విషయమన్నారు. ఆశ్రమంలోని వృద్ధులకు తన వంతు సాయం ఎప్పుడూ చేస్తూనే ఉంటానని విజయజ్యోతి పేర్కొన్నారు. అనంతరం వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి ఆమెకు శాలువాతో సన్మానించారు.



వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న విజయజ్యోతి



బహుమతి అందుకుంటున్న ఉమాదేవి

రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీ విజేత జి.ఉమాదేవి

ప్రజాశక్తి - కడప

గుంటూరు నగరంలోని చలపతి ఫార్మసిటికల్ కళాశాలలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి చెస్ ఓపెన్ ప్రైజ్ మనీ టోర్నమెంట్‌లో వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు తాలూకా, రాజుపాలెం మండలం గోపాయపల్లెకు చెందిన సీనియర్ చదరంగ క్రీడాకారిని జి. ఉమాదేవి మహిళల విభాగంలో మొదటి స్థానంలో నిలిచి విజేతగా నిలిచారు. 7 రౌండ్లకు 4 పాయింట్లు చేసి బహుమతిని ఉమాదేవి సాధించినారు. బహుమతిని గుంటూరు జిల్లా డిఎస్‌డిఒ చేతుల మీదుగా అందుకున్నారు. ఉమాదేవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఓపెన్ ప్రైజ్ మనీ టోర్నమెంట్లో విజేతగా నిలవడం పట్ల వైఎస్ఆర్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అయిన అనీస్ దర్బారి హర్షం వ్యక్తం చేశారు.

అర్థమయ్యేలా విద్యాబోధన సాగాలి

చెన్నూరు : విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన సాగాలని డిఇఒ అనురాధ పేర్కొన్నారు. సోమవారం స్థానిక బాలికోన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాడు-నేడు పనులు, జగనన్న విద్యాకానుక, మధ్యాహ్న భోజనం తదితరాలను పరిశీలించారు. టోఫెల్ బోధన గురించి నాలుగో తరగతి విద్యార్థులను పరిశీలించారు. తదుపరి విద్యార్థినులతో మమేకమై ప్రశ్న జవాబు పద్ధతిలో వారి నుంచి సమాధానాలు రాబట్టారు. అభ్యసనాభివృద్ధికి సంబంధించిన రికార్డులు, పిల్లల నోట్‌పుస్తకాలు పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. లెర్న్ ఏ వర్డ్ కార్యక్రమంలో పాంశాలలో ఎలా అమలు అవుతుందో స్వయంగా తెలు సుకున్నారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ ప్రైమరీ పాంశాలను తనిఖీ చేసి పిల్లల ప్రగతిపై సంతృప్తిని వెలి బుచ్చారు.



విద్యార్థినులను పాఠ్యాంశాలపై ప్రశ్నిస్తున్న డిఇఒ

అన్యాక్రాంత భూములను స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి- గోపవరం

కాశినాయనమండలం అక్కెంగుండ్ల నుంచి అట్లూరు మండలం వరకు అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు, చెరవులు, కుంటలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పేదలతో కలిసి బద్వేల్ ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర మాట్లాడుతూ గోపవరం బద్వేలు మండలాలలో నిరుపేదలు ఇంటి జాగా కోసం అనేకసార్లు అధికారుల చుట్టూ తిరిగి విసిగి చెందారని, వారు ఆర్‌డిఒకు దరఖాస్తులు ఇచ్చినప్పటికీ ఇంతవరకూ స్థలాలు ఇవ్వలేదని వాపోయారు. ఫిబ్రవరి 5న వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదలు సర్వే నంబర్ 1567లో పూరిగుడిసెలు వేసుకుని నివాసం ఉంటే, ఆర్‌డిఒ జెసిబిలతో కూల్చివేస్తామని బెదిరించడం దారుణమన్నారు. పేదలకు ఒక న్యాయం, పెద్దలకు ఒక న్యాయంలా ఆర్‌డిఒ వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. తక్షణమే పేదల వైపు ఆలోచించి వారికి అర్హులైనవారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున భూపోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, జిల్లా సమితి సభ్యులు పడిగే వెంకటరమణ, భూపోరాటకు కన్వీనర్ బాలు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఇమ్మానియేల్, సిపిఐ గోపవరం మండల కార్యదర్శి గూడూరు పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా, మహిళా సంఘం నాయకులు విజయమ్మ, యువజన సంఘం నాయకులు బండి అనిల్, భూపోరాట కమిటీ నాయకులు వెంకటయ్య, లక్ష్మమ్మ, హరి ,ఓబులమ్మ, సుప్రజ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆడపడుచులకు వరం చేయూత : ఎమ్మెల్యే



మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

ప్రజాశక్తి-వల్లూరు

ఆడపడుచులను ఆదుకునేందుకు వీలుగా జగనన్న చేయూత పథకానికి శ్రీకారం చుట్టారని కమలాపురం నియోజవర్గం శాసనసభ్యులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, ఎపిఎస్ ఆర్‌టిసి ఛైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం చేయూత చెక్కుల పంపిణీలో వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మహిళల జీవితాల్లో వెలుగులు నింపడానికి వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మండల, పట్టణ పరిధిలోని మహిళలకు లక్షల నిధులు విడుదలయ్యాయని తెలిపారు. 45 నుండి 60ఏళ్ల మధ్య వయస్సు గల మహిళల అభ్యున్నతి కోసం సొంత కుటుంబ సభ్యుని వలె ఏడాదికి రూ.18,750 అందిస్తున్నారని అన్నారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడటానికి, స్వయం ఉపాధి కొరకు పాటుపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి వెంకటసుబ్బయ్య, వైసిపి మండల కన్వీనర్ అబ్బి రెడ్డి, వీరారెడ్డి, మాజీ ఎంపిపి శివకుమార్ రెడ్డి , వైఎస్ఆర్ జనరల్ సెక్రటరీ ఇందిరెడ్డి శంకర్ రెడ్డి, ఎంపిటిసి రామకృష్ణారెడ్డి , మండల అధి కారులు, వైసిపి నాయకులు గుర్రంపాటి వెంకటసుబ్బారెడ్డి , రఘురామిరెడ్డి నారా యణరెడ్డి , లబ్ధిదారులు పాల్గొన్నారు.


టిడిపిలో చేరిన వారితో పుట్టా సుధాకర్ యాదవ్

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని అన్నవరం గ్రామపంచాయతీ వెంగన్నగారిపల్లె గ్రామానికి చెందిన వైసిపి నాయకులు డి.వెంకటసుబ్బారెడ్డి, కొణ్ణయరెడ్డి, కొండారెడ్డి సోమవారం వైసిపి నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. మైదుకూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా పుట్టా మాట్లాడుతూ టిడిపికి ఆదరణ పెరుగుతోందన్నారు. వైసిపి అరాచకాలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో చాపాడు మండలశాఖ అధ్యక్షుడు పల్లవోలు సుధాకర్‌రెడ్డి, లోకేష్, రామసుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అన్నవరం సత్యం, అమర్, సుబ్బారెడ్డి, సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు : 'పుట్టా'

ప్రజాశక్తి - ఖాజీపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమని, ప్రజలు అందరూ టిడిపికి పట్టం కట్టాలని మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. సోమవారం బీసీ కాలనీ, బీమవారిపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల సీనియర్ నాయకులు సండెల నాగశేషారెడ్డి, ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకులు కమలాపురం ఫరూక్, నాయకులు తుట్టే రాము యాదవ్, దాసరి శ్రీనివాసులు యాదవ్, సిద్దారం ఖదీరుల్లా, హబీబ్, జలీల్, అర్షద్, చిన్న సరిపాల వీరయ్య, పిచ్చి నాయుడు, కమలాపురం గౌస్ మొహిద్దీన్, త్రిపురవరం హరినాథ్‌రెడ్డి, పత్తూరు ఉప సర్పంచ్ ముత్యాల రమణ పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రవీణ్ కుమార్‌రెడ్డి

టిడిపితోనే పేదల సంక్షేమం : ప్రవీణ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పేదలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందించాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రూరల్ పరిధిలోని గోపవరం పంచాయతీ శ్రీనివాసపురంలో సోమవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్తల సుబ్బారెడ్డి, మార్తల ప్రతాప్‌రెడ్డి, నాదెండ్ల షరీఫ్, ఓబుల్‌రెడ్డి, అంగడి శ్రీనివాసులు, కట్టు గంగా సుధాకర్ యాదవ్, రూరల్ మండలం కన్వీనర్ బోడె బాబుల్‌రెడ్డి, మార్తల ప్రతాప్‌రెడ్డి, నాదెండ్ల విశ్వనాథరెడ్డి, బొమ్మిరెడ్డి ప్రసాద్, ముదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కూలూరు మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, అమృత్ నగర్ ఫయాజ్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవుల చెన్నయ్య, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తెలుగు యువత అధికార ప్రతినిధిగా నరసింహ

ప్రజాశక్తి - మైదుకూరు



మైదుకూరు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదేశాల మేరకు నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధిగా నాసులూరు నరసింహను నియమించారు. పార్టీలో చాలాకాలంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కష్టపడ్డ తనకు తమ నాయకుడు పుట్టా సుధాకర్ యాదవ్ తగిన గుర్తింపు ఇవ్వ డం పట్ల సంతోషంగా ఉందని నరసింహా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవీ రావడానికి సహకరించిన నాయకులకు ఎళ్లవేళలా రుణపడి ఉంటా న న్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ గెలుపు కోసం కృషి చేస్తాన న్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - చాపాడు

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయని వైసిపి నియోజకవర్గ జేసిఎస్ కన్వీనర్ యేమిరెడ్డి చంద్రఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సీతారామపురంలో సోమవారం బూత్‌స్థాయి కమిటీ సమావేశం నిర్వహించి, ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో మండల జెసిసి ఇన్‌ఛార్జి రామ్మో హన్‌రెడ్డి, గ్రామ నాయకులు వర్రా వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, గృహ సారథులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో జెసిస కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి

క్రైం కార్నర్

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక పాతవీధిలో నివాసం ఉంటున్న ప్రసన్న బాలాజీ (37) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎర్రగుంట్ల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజారాంరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నంకు చెందిన ప్రసన్న బాలాజీ భార్య నర్సుగా పని చేస్తుండడంతో ముద్దనూరుకు వచ్చి నివాసం ఉంటున్నారు. ప్రసన్న బాలాజీ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం భార్యతో గొడవ పడి రైల్వే స్టేషన్ వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.


మృతి చెందిన ప్రసన్న బాలాజీ

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు


నిరుపయోగంగా ఉన్న పిడబ్ల్యుడి బంగ్లాలోని ఓ భవనం

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ప్రజావసరాల నిమిత్తం లక్షలాది రూపాయల నిధులను వెచ్చించి నిర్మించిన కార్యాలయ భవనాలు పలు చోట్ల వృథాగా ఉన్నాయి. వీటిని ప్రజా ప్రతినిధులు, అధికారులుగానీ ఎవరూ పట్టించుకోవడంలేదు. ఈ నేపథ్యంలో పలువురు వారి సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వ భవనాలు పలు చోట్ల ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి కూడా వెళ్లాయి. స్థానిక పిడబ్ల్యుడి బంగ్లాలో ప్రభుత్వం భవనాలు వృథాగా ఉండిపోయాయి. ఈ ప్రాంతాన్ని కొందరు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగి స్తున్నారనే ఆరోపణలు ప్రజలు నుంచి ఎక్కువగా వినిపిస్తున్నాయి. బెస్త కాలనీలోని ప్రభుత్వ వసతి గృహ భవనాలు వృథాగా ఉండడంతో పలువురు పశువులు, జీవాలకు ఆవాసాల కేంద్రంగా ఉపయోగిం చుకుంటున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో విద్యార్థులు తగ్గిపోవడంతో పలు ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. ప్రభుత్వం పాఠశాల భవనాలను రైతులు కొందరు పంట ఉత్పత్తులను నిలువ చేసుకు నేందుకు వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వ భవనాలను పలువురు వ్యక్తులు అనధికారికంగా వినియోగించుకుంటున్న అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. లక్షలు విలువ చేసే ప్రభుత్వ భవనాలు స్థలాలు పరాయి వ్యక్తులు ఆధీనంలో ఉన్నా స్వాధీనం చేసుకునే చర్యలు ప్రభుత్వం చేపట్టలేదు. ప్రభుత్వం ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వారి ఉదాసీనతకు నిదర్శనమని పలువురు ఆగ్రహిస్తున్నారు. వృథాగా ఉన్న ప్రభుత్వం భవనాలను రైతుల గిడ్డంగిగా (గౌడ్ న్) మార్పు చేసి వినియోగంలోకి తీసుకొస్తే ప్రజలకు ఉపయోకరంగా ఉంటుందని ప్రజలు సూచిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జగన్ పాలనలో తెలుగు జాతి బలి

పజాశక్తి - వేంపల్లె

సిఎం జగన్ తెలుగు జాతిని బలి చేయడం శోచనీయమని ప్రముఖ కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరావు తెలిపారు. సోమవారం వేంపల్లెలో ఉన్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయడం ఒక చారిత్రిక తప్పిదమన్నారు. తెలుగు జాతి అస్థిత్వానికి ప్రమాదమని పేర్కొన్నారు. అనేక విధాలుగా విశిష్టత కలిగిన భాష తెలుగు అన్నారు. ప్రపంచంలో ఎక్కువ మాట్లాడే భాషలో 7వది తెలుగు అన్నారు. భారత దేశంలో ఎక్కువ మంది మాట్లాడే భాషల్లో 4వ భాష తెలుగు అన్నారు. 2500 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానం కలిగిన భాష తెలుగుదని తెలిపారు. 16వ శతాబ్దంలోనే దేశ భాషలేందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు కీర్తించారని చెప్పారు. భాష వారస్వత ఆస్తి అన్నారు. దానికి మెరుగులు దిద్ది భావితరాలకు అందించాలని జొన్నవిత్తుల కోరారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆంగ్ల భాషగా మార్చాలని వైసిపి ప్రభుత్వం ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. అభివృద్ధి చెందిన దేశాలన్ని అమ్మ భాష ద్వారానే ఆ స్థాయికి చేరినట్లు చెప్పారు. ప్రాథమిక విద్యను మాతృభాషలోనే బోధించడం తప్పనిసరి అని తులసిరెడ్డి అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, నరసింహరెడ్డి, బద్రి, రాఘవయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి బిజెపి తీరని ద్రోహం : పిసిసి

సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి, వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను ప్రజలు చిత్తుగా ఓడించాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో బిజెపి రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. అలాంటి బిజెపి పొత్తు, ప్రాపకం కోసం ప్రాంతీయ పార్టీలు వైసిపి, టిడిపి, జనసేన ప్రాకులాడడం శోచనీయమన్నారు. బిజెపితో టిడిపి, జనసేన ప్రత్యక్ష పొత్తు, వైసిపిది పరోక్ష పొత్తు అన్నారు. మోడీకి జగన్‌రెడ్డి భజన్‌రెడ్డిగా, చంద్రబాబు చెక్కభజన బాబుగా, పవన్‌కల్యాణ్ భజన్ కల్యాణ్‌గా మారడం సిగ్గుచేటన్నారు. ప్రాంతీయ పార్టీలను నమ్ముకుంటే కుక్క తోక పట్టుకొని గోదావరి ఈదినట్లే అని ఎద్దేవా చేశా రు. రాష్ట్రం బాగుపడా లంటే రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని తులసిరెడ్డి కోరారు.


మాట్లాడుతున్న సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరావు

మహిళలకు వరం వైఎస్సార్ చేయూత : ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - మైదుకూరు

అక్కచెల్లెమ్మల భవిత కోసం ప్రతి సంవత్సరం వైఎస్సార్ చేయూతతో ఆడబిడ్డలకు ఆర్థికంగా భరోసా ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అన్నారు. స్థానిక డిసిఎల్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం వైఎస్సార్ చేయూత పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనేదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. మహిళా సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యంగా వైఎస్సార్ చేయూత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 45 నుండి 60 సంవత్సరాలు మధ్య ఉన్న అర్హులైన ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గానికి చెందిన మహిళలకు చేయూతనిస్తున్నట్లు తెలిపారు. మహిళలు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభి షేకం చేశారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, అమెరికా వైసిపి కన్వీనర్ కోడూరు క్రిష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, నియోజకవర్గంలోని మైదుకూరు, బ్రహ్మంగారిమఠం, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట ఇన్‌ఛార్జిలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం

చక్రాయపేట : మండల కేంద్రంలో ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాలను సోమవారం వైఎస్సార్ మండల ఇన్‌ఛార్జి వైఎస్ కొండారెడ్డి, ఎంపిపి మాధవి బాలకృష్ణ ప్రారంభించారు. వీటిని రూ.4.76 కోట్ల పాడా నిధులతో కాంట్రాక్టర్ హేమసుందర్‌రెడ్డి నిర్మించారు. రూ.2కోట్లతో నిర్మించిన సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని కూడా ప్రారంభించారు. స్థానిక మండల కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉంటాయనే ఉద్దేశంతో నూతన భవనాలు అతి తక్కువ రోజుల్లో వేగవంతంగా పనులు పూర్తి చేసి ఎన్నికలకు ముందే ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రారంభించామని మండల ఇన్‌ఛార్జి వైఎస్ కొండారెడ్డి పేర్కొన్నారు. అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో రెండు కార్యాలయాలకు కొవ్వూరు మధుసూదన్ రెడ్డి, కొవ్వూరు మనోహర్ రెడ్డి(మను)స్థలం ఉచితంగా ఇచ్చారు. స్థల దాత సోదరుడు మునిరత్నం చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఇందుకూరు లీలావతి, సర్పంచ్ అర్షద్ ఆయు బాషా, ఎంపిడిఒ సోమశేఖర్, ఇఒఆర్‌డి శివారెడ్డి, మాజీ ఎంపిపి రుక్మాంగదరెడ్డి, ఉప మండల అధ్యక్షుడు సభాపతి నాయుడు, ఇఇ డి.గురివిరెడ్డి, డిఇ బి.రాముడు, ఎఇ పెద్దనేని పవన్‌కల్యాణ్, వైసిపి యువ నాయకుడు రాహుల్‌రెడ్డి, మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


కార్యాలయాల శిలాఫలకాలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జగన్‌తో మైనార్టీల కల సాకారం


ఉర్దూ జూనియర్ కళాశాల శిలాఫలకాన్ని ప్రారభిస్తున్న గౌసులాజం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో ఉర్దూ జూనియర్ కళాశాలను నిర్మించి మైనార్టీల కలను సిఎం జగన్‌రెడ్డి సాకారం చేశారని పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, హజ్‌హౌస్ కమిటీ చైర్మన్ గౌసులాజం పేర్కొన్నారు. స్థానిక రాయచోటి-పులివెందుల బైపాస్ రోడ్డులో రూ.7.76కోట్లతో నూతనంగా నిర్మించిన ఉర్దూ జూనియర్ కళాశాలను సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వేంపల్లెలో ఉర్దూ జూనియర్ కళాశాలను అతి సుందరంగా నిర్మించినట్లు చెప్పారు. ముస్లిం విద్యార్థుల విద్య కుంటుపడకుండా ఉండేందుకు ఈ కళాశాల ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం రోడ్డు భవనాల శాఖ అతిథిగృహం, రైతు బజారు, గవి మలేశ్వర స్వామి ఆలయం సమీపంలో కల్యాణ మండపాన్ని వారు ప్రారభించారు. కార్యక్రమంలో మాజీ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ సతీష్ కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, ఎంపిపి లక్ష్మి గాయత్రి, హజ్‌హౌస్ డైరెక్టర్ మునీర్, కాణిపాకం దేవస్థానం డైరెక్టర్ కొండయ్య, సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్‌వలి, షామీర్ బాషా, టైల్స్ మౌలా, రవిశంకర్ గౌడ్, గుజిరి దర్బార్, బికారి, ముత్యాల ఆంజనేయులు, భారతి, సల్మా, మటన్ బాబా, కాంట్రాక్టర్ మధుసూదన్‌రెడ్డి, సాదక్ వలి, డివిఇఒ శ్రీనివాసులురెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జెఎసి నాయకులు కోరారు. ఆ మేరకు వారు సోమవారం విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి (సిఐటియు, టి.యన్.1104,327) నాయకులు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న 3సబ్‌స్టేషన్‌ల నుండి 12మంది వయసు పైబడిన లైన్‌మెన్‌లను క్షేత్రస్థాయిలో పనిచేయమని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడం అన్యాయమన్నారు. వయసురీత్యా ఆరోగ్యం సహకరించదని, ఇలాంటి వారిని క్షేత్రస్థాయిలో పనిచేయమని పురమాయించడం తగదన్నారు. ఈ సబ్‌స్టేషన్‌లను కూడా ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలను మానుకోవాలన్నారు. ధర్నానుద్దేశించి డిఇ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఈ విషయంలో తాను కూడా అసంతృప్తికి లోనయ్యానని, అయినప్పటికీ యాజమాన్య నిర్ణయాలను అమలు చేయాల్సి ఉంటుందన్నారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ కనీసం 5రోజులపాటు లైన్‌మెన్‌లను రిలీవ్ చేయకుండా ఉంచమని కోరాగా. ఈ విషయాన్ని మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లమని డిఇ సలహా ఇచ్చారు.


ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

మహాశివరాత్రికి ఆర్‌టిసి ఆదాయం రూ.7.03 లక్షలు

- డిఎం శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మైదుకూరు

మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 8, 9వ తేదీలో మైదుకూరు డిపో నుండి లంకమల్ల మల్లేశ్వర స్వామి దర్శనానికి 12 బస్సులు, బ్రహ్మంగారిమఠంకు 14 బస్సులు, కాశినాయన జ్యోతికి 6 బస్సులు, అల్లాడుపల్లె దేవళాల మీదుగా ఒక ప్రత్యేక బస్సు నడిపామని డిఎం కె.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా సంస్థకు రూ.7,03,299 ఆదాయం వచ్చిం దన్నారు. సిబ్బంది కృషిని ఆయన అభినందించారు.




విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

విశ్వవిద్యాలయ ర్యాంకర్లకు సత్కారం

ప్రజాశక్తి - మైదుకూరు

యోగి వేమన విశ్వవిద్యాలయ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి సత్కరించారు. సోమవారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో ఆయన విద్యార్థులను అభినందించారు. ప్రతి విద్యార్థికి రూ.10,000 నగదు బహుమతిగా అందించారు. ఇటీవల ముగిసిన పరీక్షలలో మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి విద్యార్థులు అసాధారణమైన విద్యా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. మొదటి సెమిస్టర్ బిఎస్సి బోటనీలో కె.సుజిత 10/10 పాయింట్స్‌తో యూనివర్సిటీ మొదటి ర్యాంక్‌ను సాధించింగా, 3వ సెమిస్టర్ బిఎస్సి బిజెడ్సి విభాగంలో ఆర్.ఆయేషా 9.95/10 పాయింట్స్‌తో యూనివర్సిటీ మొదటి ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. అలాగే ఎస్.స్వరూప 9.73/10 పాయింట్స్‌తో యూనివర్శిటీ రెండవ ర్యాంక్ సాధించింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, ప్రిన్సిపల్ డాక్టర్ పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, అధ్యాపకులు అయ్యవారురెడ్డి, సుబ్బారాయుడు, రాధారాం, డాక్టర్ పివి కృష్ణారెడ్డి, చెన్నరాయుడు, అనురాధ, శివకేశవ పాల్గొన్నారు.

ప్రయివేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల


ఎంఇఒ శివప్రసాద్

మండలంలోని తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రయివేట్ పాఠశాలల్లో ఉచిత విద్య కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒలు శివప్రసాద్, వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ మేరకు సోమవారం వారు మాట్లాడుతూ ఉచిత విద్యా హక్కు చట్టం ప్రకారం 2024-25 సంవత్సరానికిగానూ పేద వర్గాల పిల్లలకు 25 శాతం మండలంలోని అన్ని ప్రయివేట్ పాఠశాలల్లో ఉచితంగా విద్యను అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈనెల 25లోగా దరఖాస్తులను సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. అనాథ పిల్లలకు, హెచ్‌ఐవి బాధితులకు ఐదు శాతం, షెడ్యూల్డ్ కులాలకు 10 శాతం, షెడ్యూల్డ్ తెగలకు నాలుగు శాతం, బలహీన వర్గాలు, మైనారిటీలకు ఆరు శాతం వంతున మొత్తంగా 25 శాతం ఉచితంగా విద్యను అందించడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసిపిలోకి 20 కుటుంబాలు

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని యనమల చింతల గ్రామానికి చెందిన రామకృష్ణ, మల్ల నాగార్జున, వంగనూరు నాగార్జున, ఓబులేసుతోపాటు మరో 20 కుటుంబాలు వైసిపిలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ప్రజాసంక్షేమం కోసం జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తామంతా సైనికుల్లా ఉన్నామని, ఎన్నో రకాలుగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడానికి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగదీశ్వరరెడ్డి, రాజారెడ్డి, పెద్దిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, కోడూరు రామసుబ్బారెడ్డి, బోడేల సత్య, అల్లం సత్య, తిమ్మాపురం శేఖర్, బుజ్జి, కార్యకర్తలు పాల్గొన్నారు,


వైసిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


సిఎంకు బొకే అందిస్తున్న ఎంపీర్ కన్స్ట్రక్షన్స్ అధినేత ప్రసాదరెడ్డి, సిఎంతో నిరంజన్‌రెడ్డి, నాయకులు

సిఎంతో పలువురు నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కడప జిల్లా ఒకరోజులో పర్యటనలో భాగంగా పులివెందలలో పలు ప్రారంభోత్సవాలుచేశారు. ఇందులో భాగంగా సిఎం జగన్‌ను పలువు నాయకులు కలిశారు. కలిసిన వారిలో ఎంపీర్ కన్స్ట్రక్షన్ అధినేత ప్రసాదరెడ్డి, వేముల మండలం పెండ్లూరు గ్రామానికి చెందిన కల్లూరు నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

డిగ్రీ ఫలితాల్లో వేదవ్యాస విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

స్థానిక నెహ్రూ రోడ్డులోని వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో మరోసారి సత్తా చాటారు. ఈ ఫలితాల్లో ఆరు మంది విద్యార్థులు 10కి10 జీపీఏ సాధించి యూనివర్సిటీ స్థాయిలో మొదటి ర్యాంకులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. మొదటి సెమిస్టర్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో బి.ప్రణీత, జి.గౌస్‌బీ, కె.ఆదిత్య వర్ధన్, ఎస్.సాజిద్ హుస్సేన్, వి.మన్వితరెడ్డి, కెఎస్ సాజిదా, రెహమాని 10కి10 జీపీఏ సాధించినట్లు తెలిపారు. బీకాం విభాగంలో సోనియా 9.5, మూడో సెమిస్టర్ ఎంపీసీఎస్ విభాగంలో ఎ.నాగసుష్మిత 9.51,ఎం. మీనా 9.32, ఎస్.చాంద్‌బీ 9.12, ఎంఎస్‌సీఎస్ విభాగంలో కె.అనూష 8.90, జి.జ్యోతి స్వరూప్ 8.84, బీకాం విభాగంలో ఎస్.అతిఫాభాను 8.83, కె.వినీత 8.64, ఐదో సెమిస్టర్ ఎంపిసీఎస్ విభాగంలో కె.మౌనిక 9.11, పి.లలిత 9.04, ఎంఎస్‌సీఎస్ విభాగంలో బి.చంద్రిక 9.14, బి.శ్రీదీక్షిత 8.74, బీకాం విభాగంలో సి.శ్రీదేవి 8.62, సి.ధరణి 8.50 జీపీఏ సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రామలక్ష్మిరెడ్డి, నాగరాజు, అధ్యాపకులు అభినందించారు. ఓ వైపు ఉద్యోగాలు, మరోవైపు ఫరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా వేద్యవాస డిగ్రీ కళాశాల యాజమాన్యం ముందుకెళ్తుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.


మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం